క్లుప్తంగా

పాముకాటు బాలికకు చేయూత



మహబూబాబాద్ రూరల్: కురవి మండలం రాజోలు శివారు బాలు తండాకు చెందిన గుగులోత్ భావ్ సింగ్ కుమార్తె విషికను పాము కరిచింది. వెంటనే బాలికను స్థానికులు చికిత్స నిమిత్తం ద్విచక్రవాహనంపై మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా అండర్ బ్రిడ్జి ప్రాంతానికి చేరుకోగానే ద్విచక్రవాహనం వరదనీటిలో చిక్కుకుంది. అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ బాదరబోయిన భాస్కర్ బాలికను ఎత్తుకుని నీళ్ల లోనుంచి నడిచి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించాడు.

మేము సైతం...



డోర్నకల్: డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో నిలిచిన రైళ్లకు సంబంధించిన ప్రయాణికులకు డోర్నకల్‌కు చెందిన ట్రాన్స్‌జెండర్లు తమ వంతు సహాయంగా 50కేజీల బియ్యాన్ని భోజనం కోసం అందజేశారు.

రక్షణ చర్యలు చేపట్టాలి

నెహ్రూసెంటర్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇబ్బందులు కలుగకుండా రక్షణ చర్యలు చేపట్టాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి సూచించారు. వర్షపు నీరు భారీగా ఇళ్లలోకి చేరడంతో ఆదివారం పలు వార్డుల్లో పర్యటించి ప్రజల అవసరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, వీరవెల్లి రవి, తోట రమేష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువతి మృతి

తొర్రూరు రూరల్: వేధింపులను భరించలేక ఓ యువతి మనస్తాపంతో పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని వెలికట్ట గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వెలికట్ట గ్రామానికి చెందిన కొమ్ము శ్రీనివాస్–సుగుణ దంపతుల కుమార్తె కొమ్ము సౌమ్య (21) అనే యువతి హైదరాబాద్‌లోని ఓ రియల్ ఎస్టేట్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తుంది. ఈక్రమంలో నల్లగొండ జిల్లాలోని చౌటుప్పల్ మండలంలోని అలంపురం గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ నిర్వాహకుడు జిన్నమోని యాదగిరి అనే వ్యక్తి యువతి సౌమ్యను ప్రేమిస్తున్నానని కొన్ని నెలలుగా వేధింపులకు గురి చేస్తున్నాడు. రెండురోజుల క్రితం స్వగ్రామం వెలికట్టకు వచ్చిన యువతికి మళ్లీ యాదగిరి ఫోన్ చేయడం ప్రారంభించాడు. దీంతో మనస్తాపానికి గురై శనివారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే కుటుంబ సభ్యులు యువతిను వరంగల్‌లోని ఓ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. దీంతో మృతురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఏఎస్సై ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో మహిళ..

కేసముద్రం: విద్యుత్‌షాక్‌తో ఓ మహిళ మృతి చెందిన సంఘటన ఇనుగుర్తి మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇనుగుర్తి గ్రామానికి చెందిన కొండా యాదమ్మ(55) ఇంట్లో ఆవరణంలో గల ఇనుపతీగపై బట్టలు ఆరవేస్తుండగా, అప్పటికే ఆ తీగకు విద్యుత్ తీగ ఆనడంతో ఆమె విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆర్థికసాయం

దంతాలపల్లి: నిరుపేద కుటుంబ విద్యార్థులకు పైచదువులకు అండగా ఉంటానని హైకోర్టు న్యాయవాది జట్టి ఆజాద్ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని బీరిశెట్టిగూడెం వీడీసీ, స్వయం సేవ సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న విలేజీ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో అదే గ్రామానికి చెందిన నగరకంటి ప్రియాంక ఉన్నత చదువుల కోసం ఆదివారం రూ.50వేల ఆర్థిక సాయం అందించారు.

గడువు పెంపు

మహబూబాబాద్‌అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఓపెన్ డిగ్రీ ప్రవేశాలకు గడువు ఈ నెల 30 వరకు ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్ నాయక్, కోఆర్డినేటర్ హతిరాం నాయక్ ఆదివారం తెలిపారు. ఇంటర్, ఐటీఐ, ఓపెన్ ఇంటర్ పాసైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో www.braouonline.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు లు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో (7382929705) సంప్రదించాలన్నారు.

వర్షబీభత్సం.. జనజీవనం అస్తవ్యస్తం

- భారీ వర్షాలకు అపార నష్టం
- తెగిన చెరువు కట్టలు, కూలిన ఇళ్లు
- నేలవాలిన పంటలు
- నిలిచిన రాకపోకలు

జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు కురిసిన భారీ వర్షం జలప్రళయాన్ని సృష్టించింది. పంటలు నీట మునిగాయి. చెరువుల కట్టలు తెగిపోయాయి. వరద నీరు ఇళ్లల్లోకి రావడంతో ప్రజలు బయటకు పరుగులు తీశారు. ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, యశస్వినిరెడ్డి వరద ఉధృతిని పరిశీలించారు.

\- సాక్షి నెట్‌వర్క్



పెద్దవంగర: తెగిపోయిన తిరుమలగిరి ప్రధాన రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



గూడూరు: పాకాల వాగు ఉధృతిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్



చిన్నగూడూరు: ఆకేరు ఉధృతిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్



మహబూబాబాద్ రూరల్: అయోధ్య గ్రామంలో తెగిన చెరువు కట్ట



కురవి: కాకులబోడు తండా చెరువుకు పడిన గండి



నెల్లికుదురు: రాజులకొత్తపల్లిలో తెగిపోయిన చెరువుకట్ట



నెల్లికుదురు ఆలేరులో తెగిపోయిన చెరువు కట్ట



కురవి: అయ్యగారిపల్లి చెరువుకు గండి..



గంగారం: కోమట్లగూడెంలో కూలిన ఇల్లు



కురవి బస్టాండ్‌లో నిలిచిన వరద నీరు



గూడూరు: గోడ కూలిన నిరుపేదకు ఆర్థికసాయం చేస్తున్న మాజీ సర్పంచ్ రమేష్



మరిపెడ: కూలిన ఇంటిలో బాధితురాలు



మరిపెడ రూరల్: చిల్లంచర్లలో నేలమట్టమైన ఇల్లు



బయ్యారం–స్టేషన్‌గుండ్రాతిమడుగు మధ్య రహదారిపై ప్రవహిస్తున్న పాకాల వరదనీరు



నెల్లికుదురు: వరద నీటిలో రావిరాల గ్రామం



కురవి: నేరడ శివారు రాయినిపట్నం వద్ద నేలకొరిగిన బీరతోట పందిరి



మహబూబాబాద్ రూరల్: ఆమనగల్ గ్రామంలో ఇంటిలోకి చేరిన వర్షపు నీరు



మరిపెడ రూరల్: చిల్లంచర్లలో మృతిచెందిన పశువులు



కొత్తగూడ: చెరువును తలపిస్తున్న వరి పొలాలు



దంతాలపల్లి: బొడ్లాడ గ్రామంలో తెగిన రోడ్డు



నెల్లికుదురు: రావిరాల ప్రధాన రహదారిపై వరద తీవ్రతను పరిశీలిస్తున్న డీఎస్పీ సురేష్



నెల్లికుదురు: జేసీబీ సహాయంతో ప్రయాణికులను పంపిస్తున్న పోలీసులు



మహబూబాబాద్: శనిగపురంలో పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు, కౌన్సిలర్ హరిసింగ్

సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలి

మహబూబాబాద్/మహబూబాబాద్ అర్బన్: సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని టీఎన్జీఓఎస్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్, టీజీఓ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ రఫీ, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ, యూటీఎఫ్ రాష్ట్ర బాధ్యుడు ఎస్.మల్లారెడ్డి, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నాగముణి, రవీందర్, వీరునాయక్, సదానందం, వెంకట్‌రెడ్డి, రామోజీ నాయక్, రోహిత్, రామలింగారెడ్డి, భిక్షపతి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం: బయ్యారంలో సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో ఆందోళన చేసి బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి శ్రీకాంత్ నాయక్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, బిక్కులాల్, రామారావు, చిరంజీవి, రాంబాబు, పూర్ణచందర్, రాందాస్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్: నిరసన తెలుపుతున్న సంఘాల నాయకులు

యువకుడిని కాపాడిన అధికారులు



యువకుడితో అధికారులు

కొత్తగూడ: ప్రమాదవశాత్తు వాగులో కొట్టుకుపోయిన యువకుడిని ఎస్సై కుశకుమార్ ఆధ్వర్యంలో అధికారులు కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి. గంగారం మండల కేంద్రానికి చెందిన ముగ్గురు యువకులు పనిపై ద్విచక్రవాహనంపై నర్సంపేట పట్టణానికి వెళ్లారు. అప్పటికే వర్షం పడుతుంది. తగ్గుతుందేమో అని రాత్రి పది గంటల వరకు అక్కడే వేచి చూశారు. తగ్గక పోవడంతో వర్షంలోనే తిరిగి ప్రయాణమై వస్తుండగా కొత్తగూడ మండల కేంద్రం సమీపంలోని గుంజేడు వాగు దాటేందుకు ప్రయత్నిస్తుండగా పడిపోయారు. ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంతో బయటకు వచ్చారు. సుంచ శివ అనే యువకుడు వాగులో కొట్టుకు పోయి వాగు మధ్యలో చెట్టుకొమ్మను పట్టుకుని ఉండిపోయాడు. విషయం తెలుసుకున్న ఎస్సై కుశకుమార్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది వాగు వద్దకు చేరుకున్నారు. జూనియర్ అసిస్టెంట్ జనగం పాపారావు ఈదుకుంటూ శివ వద్దకు వెళ్లి తాడు సహాయంతో బయటకు తీసుకుని వచ్చాడు.



పరవళ్లు తొక్కుతున్న భీమునిపాదం జలపాతం

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ సమీప దట్టమైన అడవిలోని భీమునిపాద జలపాతం జలసవ్వడి సంతరించుకుంది. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వరద పోటెత్తుతోంది.

జాగ్రత్తలు పాటించాలి

డీఎంహెచ్ఓ మురళీధర్

నెహ్రూసెంటర్: జిల్లాలో వర్షాలు అధికంగా కురుస్తుండటంతో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, వైద్యసిబ్బంది అప్రమత్తంగా ప్రజలకు వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ మురళీధర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఎవరైన అనారోగ్యానికి గురైతే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యసేవలు పొందవచ్చన్నారు. వైద్యసేవల కోసం అత్యవసర సమయాల్లో 96766 21992 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మహబూబాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో మానుకోట పార్లమెంట్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండి అత్యవసరమైతే తప్పా బయటకు రావద్దని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోత్ కవిత ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు.

బాలుడికి అస్వస్థత

డోర్నకల్: హైదరాబాద్‌కు చెందిన శ్రీకాంత్ కుటుంబ సభ్యులతో పద్మావతి ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా వర్షాలతో రైలు డోర్నకల్‌లో నిలిచింది. ఇదే సమయంలో తన 16నెలల కుమారుడు రోహన్ తీవ్ర అస్వస్థతకు గురికాగా స్టేషన్ ఆవరణలోని 108 వాహనం ద్వారా డోర్నకల్ పీహెచ్‌సీకి తరలించి అక్కడి నుంచి ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

రైల్వే ప్రయాణికులకు సేవలు



పండ్లు పంపిణీ చేస్తున్న మహమ్మద్ ఫరీద్



వాసవీ క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో భోజనం పంపిణీ

మహబూబాబాద్ రూరల్: భారీ తుఫాన్ వర్షం కారణంగా మహబూబాబాద్ రైల్వే స్టేషన్ రెండో నంబరు ప్లాట్‌ఫారం వైపున మచిలీపట్నం, సింహపురి రైళ్లు నిలిచిపోయాయి. సుమారు రెండు వేల మంది వరకు ప్రయాణికులు ఉండగా వారు ఇబ్బందులు పడుతుండగా సమాచారం తెలుసుకున్న టౌన్ పోలీసులు, జీవీఎల్, వాసవి సేవా ట్రస్ట్, వాసవీ దేవాలయ కమిటీ, సత్యసాయి సేవా సమితి కపుల్స్ సేవా కార్యక్రమాలు చేపట్టారు. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సై బి.విజయ్ కుమార్, సిబ్బంది మోహన్, సురేందర్, గౌతం తదితరులు తమకు తోచిన విధంగా సహాయం చేశారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మహమ్మద్ ఫరీద్ నేతృత్వంలో బ్రెడ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

నిలిచిన ఆర్టీసీ బస్సులు



నెహ్రూసెంటర్: మహబూబాబాద్ జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మహబూబాబాద్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే రోడ్లన్నీ జలమయంకావడం, రాకపోకలకు అంతరాయం కలగడంతో ఆర్టీసీ బస్సులన్నీ డిపోకే పరిమితమయ్యాయి. జిల్లాలో వాగులు, వంకలు పొంగడంతో రాకపోకలు సాగక బస్సు సర్వీసులను నిలిపివేశారు.

వృద్ధ దంపతులను కాపాడిన జర్నలిస్టు



నెల్లికుదురు: మండలంలోని రావిరాల గ్రామంలో చెరువు తెగి గ్రామంలోకి వరద నీరు రావడంతో ఇళ్లు మునిగిపోయాయి. రేకుల ఇంట్లో ఉన్న వృద్ధ దంపతులు రాలేని పరిస్థితిలో ఉన్నారు. ఆదివారం ఓ జర్నలిస్టు శ్రీధర్ మరో వ్యక్తితో కలిసి వృద్ధ దంపతులను కాపాడి వరద నీటి నుంచి బయటకు తీసుకొచ్చాడు. వసతి చేయించాడు.

ఏసీబీ అధికారి పేరుతో టోకరా

కొత్తగూడ: ఏసీబీ డీఎస్పీ అంటూ ఫోన్ చేసి ఓ అధికారికి రూ.35వేలు టోకరా వేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా పనిచేస్తున్న ఓ అధికారికి గత నెల 25న 09611184583, 07259011291 నంబర్ల నుంచి ఫోన్ చేసి నేను ఏసీబీ డీఎస్పీని అంటూ మాట్లాడారు. 'నువ్వు తహసీల్దార్ కార్యాలయంలో అవినీతికి పాల్పడుతున్నట్లు మాకు ఫిర్యాదు అందింది మీ ఇంటిపై దాడులు చేసేందుకు మా సిబ్బంది వస్తున్నారు' అని బెదిరించారు. దీంతో భయపడిన సదరు అధికారి బ్రతిమిలాడటం మొదలు పెట్టారు. దీంతో తమకు రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంత లేవని మా వద్ద కేవలం రూ. 35వేలు మాత్రమే ఉన్నాయని అనడంతో అవి 6364313222 నంబర్‌కు ఫోన్ పే చేయించుకున్నారు. విషయం తెలిసిన బంధువులు ఫోన్ పే నంబర్‌కు ఫోన్ చేయగా తాను సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అని ఫోన్ కట్ చేయడంతో మోసపోయినట్లు గ్రహించారు. ఈ విషయమై ఎస్సై కుశ కుమార్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.